# శని అమావాస్య, జయంతి వేడుకలు

- నవగ్రహాలకు తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు
- 'ఓం నమఃశివాయ' నామస్మరణతో మార్మోగిన వేములవాడ



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శని అమావాస్య, శని జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. శనివారం రోజున శని అమావాస్య రావడం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకోవడంతో, ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ప్రధాన ఆలయం (రాజన్న సన్నిధి) విస్తరణ పనుల నేపథ్యంలో, భక్తుల రద్దీ అంతా భీమేశ్వర ఆలయానికే చేరుకోవడంతో ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. శని జయంతిని పురస్కరించుకుని ఆలయంలోని శ్రీ శనేశ్వర స్వామివారికి అర్చకులు ప్రత్యేక తైలాభిషేకం నిర్వహించారు. భక్తులు నవధాన్యాలు, నల్ల వస్త్రాలు, నువ్వుల నూనెను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని వంటి గ్రహదోషాలు, పీడలు తొలగి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు సిద్ధించాలని భక్తులు స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు నవగ్రహ మండపం చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలోని శ్రీ ఆంజనేయ స్వామివారి సన్నిధిలో "జై హనుమాన్.. జై జై శ్రీరామ్" నామస్మరణలతో భక్తి పారవశ్యంలో మునిగితేలారు. శని దోష నివారణకు ఆంజనేయ స్వామి ఆరాధన విశేష ఫలితాలను ఇస్తుందని పురోహితులు పేర్కొన్నారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారికి (లింగరూప శివునికి) అర్చక స్వాములు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతులు నిర్వహించగా, ఆలయ ప్రాంగణం "ఓం నమఃశివాయ" నామస్మరణతో మారుమోగింది. భక్తులు తమ మొక్కులలో భాగంగా కోడె మొక్కులు చెల్లించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. శని జయంతి నాడు శనేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే జీవితంలోని కష్టాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. శని అమావాస్య సందర్భంగా ఆలయానికి పోటెత్తిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దర్శన క్యూ లైన్లలో దేవస్థానం అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# నగరేశ్వర స్వామి ఆలయంలో నిత్య చండీహోమాలు

- ప్రతి రోజు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు
- దుర్గామాత అనుగ్రహం, సకల శుభాల కోసం తరలివస్తున్న భక్తులు



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ నగరేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అధికారులు నిత్య చండీ హోమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు వైదిక పండితులు, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఈ హోమ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. దుర్గామాత అనుగ్రహం కోసం నిర్వహించే ఈ చండీ హోమానికి విశేష ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉండటంతో, నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ పవిత్ర క్రతువులో పాల్గొంటున్నారు. ఈ చండీ హోమంలో పాల్గొనదలచిన భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హోమ పూజకు అవసరమైన సంపూర్ణ పూజా సామాగ్రిని ఆలయ పక్షానే భక్తులకు ఉచితంగా అందజేస్తున్నారు. ఒక హోమ టికెట్‌పై ఇద్దరు భక్తులను హోమ పూజా విధానంలో కూర్చోబెడుతున్నారు. ఈ విశేష హోమ పూజకు టికెట్ ధరను రూ. 1,516గా ఆలయ కమిటీ నిర్ణయించింది. లోకకల్యాణార్థం, అమ్మవారి కృపాకటాక్షాల కోసం జరిపే ఈ చండీ హోమం అత్యంత శక్తివంతమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ హోమ గుండం నుండి వచ్చే పవిత్ర ధూమం, మంత్రోచ్ఛారణల ద్వారా కుటుంబంలో శాంతి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల బలమైన విశ్వాసం. అలాగే జాతకంలోని నవగ్రహ దోషాలు, వ్యాపార, ఉద్యోగాల్లో ఎదురయ్యే అడ్డంకులు తొలగి సకల శుభఫలితాలు కలుగుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి. నిత్యం అధిక సంఖ్యలో భక్తులు ఈ హోమాల్లో పాల్గొని తమ మొక్కులు సమర్పించుకుంటుండటంతో, నగరేశ్వర ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో కిక్కిరిసిపోతూ అపార ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటోంది.



# గంజాయి నియంత్రణే లక్ష్యంగా నార్కోటిక్ జగిలాలతో విస్తృత తనిఖీలు

**సిరిసిల్ల తంగళ్ళపల్లి ప్రాంతాలలో కిరాణా, పాన్ షాప్, బస్టాండ్ ప్రాంతాలలో తనిఖీ**

**ప్రజానావ, సిరిసిల్ల :** గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శనివారం నార్కోటిక్ డాగ్ సహాయంతో సిరిసిల్ల, తంగళ్లపల్లి ప్రాంతాల్లోని కిరాణా, పాన్ షాప్‌లతో పాటు బస్టాండ్ పరిసరాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగానే పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు, బస్టాండ్ ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలాలతో తరచూ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు, యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా వ్యక్తుల వద్ద, పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు లేదా ఇతర షాపుల్లో ప్రభుత్వం నిషేధించిన గంజాయి, మత్తు పదార్థాలు నిల్వ ఉంచినా లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100/112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌కు అదనపు బస్సులు నడపాలి

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి హైదరాబాదుకు అదనపు బస్సు సర్వీసులు నడిపించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వి కార్యకర్తలు సిరిసిల్ల పాత బస్టాండులో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వి నాయకుడు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ అదనపు బస్ సర్వీసులు నడిపించాలని పలుమార్లు డిపో అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన స్పందనలేదని ఆరోపించారు. హైదరాబాద్‌కు సిరిసిల్ల డిపో నుండి నేరుగా బస్సులు లేకపోవడంతో వేములవాడ నుంచి వచ్చే బస్సులలో సీట్లు దొరకడం లేదని తెలిపారు. పది రోజులలో సమస్యను పరిష్కరించి అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, ఆరెల్లి వినయ్ కుమార్, సాదు శేఖర్, బాల్యాల ప్రవీణ్, ఎండి అజ్జు, లింగంపల్లి అబ్బి, పవన్, కోడం వెంకటేశం అల్వాల లక్ష్మణ్, మాగంటి భాను, ధనుష్ రాజు, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల పాత బస్టాండ్‌లో బీఆర్ఎస్వీ ధర్నా





# వేములవాడ మున్సిపల్ కమిషనర్‌గా లోకేష్ బాధ్యతల స్వీకరణ

**ప్రజానావ, వేములవాడ :** వేములవాడ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నియమితులైన లోకేష్ శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు పారదర్శకంగా పనిచేస్తానని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్షన్‌దారులు ముఖ గుర్తింపు నమోదు చేసుకోవాలి

**మున్సిపల్ కమిషనర్ ఖదీర్**



**ప్రజానావ, సిరిసిల్ల :** చేయూత పెన్షన్ పొందుతున్న లబ్దిదారులు ఫేసియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్వేర్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా తమ వివరాలు (ఆధార్ కార్డు) వారికి సంబంధించిన వార్డు ఆఫీసరు దగ్గర త్వరితగతిన నమోదు చేసు కోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండి ఖదీర్ పాషా వెల్లడించారు. సిరిసిల్ల పురపాలక సంఘ పరిధిలో చేయూత పెన్షన్ పొందుతున్న లబ్దిదారులు సర్ఫ్ తెలంగాణ వారిచే జారీ చేయబడిన సర్క్యులర్ నెం.1677/2026లో పొందుపరచిన ఆదేశాల ప్రకారం చేయూత పెన్షన్ పొందుతున్న లబ్దిదారులు ఎఫ్ఆర్ఎస్ త్వరితగతిన నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ ఉద్దేశం కేవలం పెన్షన్ దారు బ్రతికి ఉన్నట్లుగా నిర్ధారించుటకు మాత్రమే కాని పెన్షన్ తొలగింపునకు కాదు అనే విషయాన్ని ప్రజలు గమనించి వార్డు ఆఫీసరుకు సహకరించాలని కమిషనర్ కోరారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

**జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత**



**ప్రజానావ, సిరిసిల్ల :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత డిమాండ్ చేశారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు ధరలను నియంత్రించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికలు ముగిసిన వెంటనే సామాన్య ప్రజలపై భారాన్ని మోపిందని ఆమె విమర్శించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనలో నరేంద్ర మోడీ ప్రజలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ తక్కువగా వాడాలని, ఒక సంవత్సరం పాటు బంగారం కొనవద్దని చెప్పడం బాధ్యతారాహిత్య వ్యాఖ్యలని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, ఇంధన ధరల పెంపు వల్ల మధ్యతరగతి, పేద ప్రజల జీవనం వెంటనే పెంచిన భారంగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని మహిళా కాంగ్రెస్ పార్టీ పక్షాన వనిత డిమాండ్ చేశారు.

# దోస్త్ రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం



**ప్రజానావ, సిరిసిల్ల :** తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేది నుంచి దోస్త్ రెండో విడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమెయిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు విద్యార్థినులు దోస్త్ వెబ్ సైట్ లో ఐడి క్రియేట్ చేసి కళాశాలలో సంప్రదించాలని సూచించారు. కళాశాలలో ఎంపీసీ, ఎంపీసీఎస్ బిజడ్సి, ఎంజెడ్సి, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ తో పాటు బిఏ గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ పూర్తయిన గిరిజన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు ఇతర వివరాలకు 9985607074, 8008374874 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ జయ సూచించారు.

# కేంద్ర మంత్రికి బెదిరింపు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

**ప్రజానావ, ముంబై :** కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని బెదిరించి కోట్ల రూపాయలు డిమాండ్ చేసిన కేసులో నాగ్‌పూర్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిందితులు జయేష్ పూజారి అలియాస్ షకీర్, అఫ్సర్ పాషాలకు చెరొక ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2023లో గడ్కరి పీఆర్ కార్యాలయానికి వచ్చిన బెదిరింపు కాల్స్‌లో మొదట రూ.100 కోట్లు, తరువాత రూ.10 కోట్లు డిమాండ్ చేస్తూ హత్య బెదిరింపులు చేశారు. విచారణలో ఈ కాల్స్ కర్ణాటకలోని హిండ్లగా జైలు నుంచి చేసినట్లు తేలింది. యూఏపీఏ సహా పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు కాగా, 65 మంది సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలపై కోర్టు నిందితులను దోషులుగా నిర్ధారించింది.

